# నిర్ణయం

## - టి.వెంకట సుబ్బారెడ్డి

"అశోక్ అంటే నీవేనా?" కానిస్టేబుల్ కనకారావు అడిగాడు.

"నేనే సార్."

"యస్.ఐ అరుణకుమార్‌గారు నిన్ను ఇంటి వద్దకు పిల్చుకు రమ్మన్నారు."

"నేనేం నేరం చేసాను సార్!"

"నేరం చేసి వుంటే స్టేషనుకు లాక్కురమ్మనేవారు. ఎస్.ఐగారి ఇంటి వద్దకు ఎందుకు పిల్చుకు రమ్మంటారు?"

"నమస్తే సార్" అన్నాడు అశోక్ హాల్లో కూర్చుని వున్న ఎస్ఐగారితో.

"రావయ్యా రా! రఘురాం అనే పెద్దమనిషిని కొట్టావట. నిజమేనా? అతన్నెందుకు కొట్టావ్?"

"రఘురాంగారు అతని కొడుకు స్కూలుకు వెళ్ళలేదని నడిరోడ్డులో గొడ్డును బాదినట్లు బాదుతుంటే చూడలేక పోయాను సార్. తెలియని వయస్సు, నచ్చచెప్పి బడికి పంపాలేగానీ ఇలా కొట్టవచ్చా అని నచ్చచెప్పాను సార్. 'నీవెవడ్రా నాకు చెప్పడానికి? నా కొడుకు నా ఇష్టం' అన్నాడు సార్. కోపం వచ్చి రెండు దెబ్బలు కొట్టాను సార్."

"ఇంతకుముందు కూడా నీకు సంబంధంలేని విషయాల్లో తలదూర్చి స్టేషన్‌వరకు వచ్చావు కదూ?"

"అవును సార్."

'చూడు. చట్టమేమైనా నీ చుట్టమా? అన్యాయాలనెదిరించే హీరోననుకుంటున్నావా? ఇది సినిమా కాదు, జీవితం. నీవు ఆటో డ్రైవర్‌వు. ఇంకా పెళ్లి పెటాకులు కాలేదు. రోడ్డుపైన జరిగే సంఘటనలు చూసీ చూడనట్టు పోవాలేతప్ప అనవసర విషయాల్లో తలదూర్చడమెందుకు? ఆ రఘురాం నిన్న స్టేషన్‌కువచ్చి నీపై రిపోర్టిచ్చాడు. అతనికి నచ్చచెప్పి ఎలాగో పంపేసాను. ఇంకే ఎస్ఐ అయినా కోతిపుండు బ్రహ్మాండం చేసేవాడు. నేనెందుకు ఇలా చేసానో తెలుసా? చదువుకునే రోజుల్లో నీ తండ్రి రామయ్య నా బెస్ట్ ఫ్రెండ్. ఇకనైనా జాగ్రత్తగా మసలుకో. సరే వెళ్ళు."

"ఎంతటి ఘోరం కళ్లముందు జరిగినా చూసీ చూడనట్టు ఉండాలా సార్?"

"అందుకు పోలీసులున్నారు, చట్టాలున్నాయి. గుర్తుంచుకో చట్టం నీ చుట్టం కాదు."

"సరే సార్. వెళ్లొస్తాను సార్. నమస్తే సార్" అంటూ వినయంగా వెళ్లిపోయాడు అశోక్.

జరిగిన సంఘటన పక్కగదిలో నుండి గమనించింది లావణ్య. ఎవడో మనసున్న మంచి మనిషిలా ఉన్నాడనుకుంది. తండ్రి మాటలు అసహజంగా అనిపించింది. మనసుండక తన తండ్రి వున్న హాల్లోకొచ్చింది.

"ఏంటి నాన్నా! అతని తప్పేముంది? అతన్ని అలా దండించి పంపడం నాకేం నచ్చలేదు."

"లావణ్యా! ఇలాంటి విషయాలు నీకెందుకమ్మా. వెళ్లి నీ చదువేదో నీవు చూసుకో."

లావణ్య కోపంతో తన గదికి వెళ్లిపోయింది.

లావణ్య చాలా అందమైన అమ్మాయి. డిగ్రీ ఫైనల్ ఇయర్ చదువుతున్నది. ఎందరికో లావణ్యపై కళ్ళు పడ్డా, ఆమె తండ్రికి భయపడి దూరంగా వుంటున్నారు. కానీ కిరణ్ ఒక్కడే 'ఐ లవ్ యూ లావణ్య' అంటూ చెప్పగలిగాడు, తిరస్కరింపబడ్డాడు. కిరణ్‌కు మున్సిపల్ ఛైర్మన్ కొడుకుననే అహంభావముంది. ఒక ఎస్ఐ కూతురు తననేం చేయగలదనే ధీమా వుంది. అన్నిటినీ మించి తన స్నేహితుల అండదండలున్నాయి. రాజకీయంగా పలుకుబడి వుంది. అందుకే ఎలాగైనా లావణ్య పొగరు అణచాలనే పట్టుదల పెరిగింది. సమయం కోసం ఎదురు చూస్తున్నాడు.

***

రెండు నెలలు గడిచాయి. మండల కేంద్రానికి జన్మభూమి కార్యక్రమంలో ముఖ్యమంత్రి పాల్గొంటారని, యస్‌పి ఆజ్ఞపై అరుణకుమార్ బందోబస్తుకు వెళ్లవలసి వచ్చింది. ఈ విషయం కిరణ్ గమనించాడు. ఎలాగైనా లావణ్యను అనుభవించి తీరాలని నిశ్చయించుకున్నాడు.

సాయంత్రం నాలుగు గంటలయింది. కాలేజీ వదిలారు. అప్పటికే చాలామంది విద్యార్థులు తమ ఇళ్ళకు వెళ్లిపోయారు. ఆ రోజు లావణ్య తన స్నేహితురాండ్రతో మాట్లాడుతూ వరండాలోకి వచ్చింది. ఇంతలో కిరణ్ ఎదురొచ్చాడు.

"ఏయ్ లావణ్య డార్లింగ్! ఎన్నిసార్లు నేను నిన్ను ప్రేమిస్తున్నానన్నా తిరస్కరించావుకదా. అందగత్తెనని అహంభావమా? నీ పొగరు తగ్గిస్తా. పద క్లాస్ రూములోకి" అంటూ చేయి పట్టుకుని లాగాడు.

"రేయ్ రాస్కెల్! నిన్ను చెప్పిచ్చుకు కొట్టినా పాపంలేదు. నీలాంటి వెధవను ఏ అమ్మాయి ప్రేమిస్తుందిరా? పెళ్లాడడానికి ఏ అమ్మాయి ఇష్టపడుతుందిరా?"

"ప్రేమా లేదు, పెళ్లిలేదు. డైరెక్టుగా మనకు శోభనమే. పద గదిలోకి" అంటూ తోసుకుంటూ వెళ్లాడు.

పరిస్థితి విషమిస్తున్నదని లావణ్య స్నేహితురాళ్ళు హాహాకారాలు చేస్తూ పరుగులు తీసారు. కిరణ్ స్నేహితులు శోభనం చూడవచ్చుననే ఉత్సాహంతో ఈలలు వేసారు. ఇక గదిలోకి వెళ్లడమే తరువాయి. ఉన్నట్టుండి లావణ్య కిరణ్‌ను విదిలించి కొట్టింది. సింహం బారినపడ్డ లేడికి విముక్తి లభించినట్టు ప్రిన్సిపాల్ గదివైపు పరుగులు పెట్టింది. ఎదురుగా కిరణ్ స్నేహితులు ఇద్దరు అడ్డుపడి పట్టుకోబోయారు. తప్పించుకుని రోడ్డువైపు పరుగులు తీసింది. కాలేజీ గేటు వద్దకు చేరేసరికి వెంబడించిన కిరణ్ అడ్డుపడ్డాడు. సరిగ్గా అదే సమయానికి అశోక్ ఆటో అక్కడ ఆగింది. సందర్భాన్ని సరిగ్గానే అంచనా వేయగలిగాడు. ఆదుర్దాగా వచ్చి లావణ్య ముందు నిలిచాడు. అయినా అప్పటికే లావణ్య చేయి పట్టుకున్నాడు కిరణ్. లావణ్య ఏడవడం మొదలుపెట్టింది.

"ఏం జరుగుతున్నదిక్కడ?" గంభీరంగా ప్రశ్నించాడు అశోక్.

"రేయ్ ఎవడ్రా నీవు? వెళ్లిపో. లేకుంటే మర్యాదగా ఉండదు. నేనెవరో తెలుసా? మున్సిపల్ ఛైర్మన్ కొడుకును. చుట్టూ వున్నవారంతా నా స్నేహితులే. మాతో పెట్టుకోకు. అనవసర విషయాల్లో తల దూర్చావంటే ఫలితం అనుభవిస్తావ్?" అన్నాడు కోపంగా కిరణ్.

అశోక్ ఒక్క మాట మాట్లాడలేదు. బలంగా చాచి కిరణ్ చెంపపై ఒక్క దెబ్బ కొట్టాడు. కిరణ్ తూలి కింద పడ్డాడు. కిరణ్ స్నేహితులు అశోక్ చుట్టూ మూగారు. దొమ్మి యుద్ధం మొదలైంది. అశోక్ దెబ్బలకు కిరణ్‌తోసహా అతని స్నేహితులంతా పారిపోయాడు. అశోక్‌కు కూడా బాగా దెబ్బలు తగిలాయి. అయినా లావణ్యను వాళ్ల ఇంటివద్ద

దించాడు. అప్పుడు గమనించాడు అది ఎస్‌ఐ ఇల్లని. అంతే! “వెళ్లొస్తానండీ” అంటూ వెనుతిరిగాడు.

★★★

అదే రోజు రాత్రి ఇంటికి వచ్చిన అరుణకుమార్‌కు లావణ్య జరిగిన సంఘటన చెప్పడంతో మితిమీరిన కోపంతో అశోక్ ఇంటికి వెళ్లాడు. గాయాలతో వళ్లెరగకుండా మంచంపై పడున్న అతనితో మాట్లాడాడు. జరిగిన సంఘటన గురించి చర్చించి కిరణ్‌పై కేసు వేసి అతనికి శిక్ష పడేలా సాక్ష్యం చెప్పాలని ఒప్పించి వెనుదిరిగాడు.

రాత్రి తొమ్మిదిగంటలకు అరుణకుమార్ ఇంటికి వచ్చాడు.

ఆ సమయంలో ఇంటి ముందు మూడు కార్లు వచ్చి ఆగాయి. సందడి విని బయటకు వచ్చిన అతనికి కార్లలో నుండి దిగుతున్న మున్సిపల్ ఛైర్మన్, ఎంఎల్ఏ కనిపించారు. వెంటనే ఏం జరగబోతోందో అర్థమైంది.

★★★

ఛైర్మన్‌ను ఖాతరు చేయకపోయినా వెంటవున్న యంఎల్ఏగారికి వందనం చేయక తప్పలేదు. గంటసేపు సంభాషణలు జరిగాయి. కిరణ్‌పై పెట్టిన కేసు విత్‌డ్రా చేసుకోవాలని చర్చ సారాంశం. యంఎల్ఏగారి వత్తిడికి తల వొగ్గవలసివచ్చింది.

ఆ మరునాటి ఉదయానికి అశోక్ యస్ఐగారి ఇంటికి వచ్చాడు.

“అశోక్! ఇక నీవు సాక్ష్యం చెప్పవలసిన పని లేదు. మేమొక రాజీకి వచ్చాం. అయినా మాట ప్రకారం వచ్చినందుకు థాంక్స్” అన్నాడు అరుణకుమార్.

ఇంతలో లావణ్య దురుసుగా ప్రవేశించింది.

“ఏంటి నాన్నా! మీరు మాట్లాడుతున్నది. కేసు ఎందుకు విత్‌డ్రా చేసుకుంటున్నారు? రాత్రి ఎంఎల్ఏ, ఛైర్మన్‌లతో మాట్లాడింది ఈ విషయమేనని నాకు తెలుసు. నేనూ మీ మాటలు పూర్తిగా విన్నాను. నా మనసెంత బాధపడిందో నాకు తెలుసు. కన్నతండ్రిగా మీ బాధ్యత ఇంతేనా?”

“లావణ్యా! కొన్ని కారణాలవల్ల విత్‌డ్రా చేసుకోక తప్పలేదు. కేసు పెడితే జరగబోయే పరిణామాలు ఎలా వుంటాయో చిన్నపిల్లవు నీకు తెలియదు.’

“ఏంటి నాన్నా ఆ పరిస్థితులు? వాళ్లొచ్చి బెదిరించేసరికి భయపడ్డావు. కూతురి శీలం కన్నా నీకు నీ ప్రాణం ముఖ్యమా? చట్టాన్ని చేతిలోకి తీసుకోకూడదు అని అశోక్‌కు ఆ రోజు అన్నావే. చట్టాన్ని సంరక్షించవలసిన నీవు వెనకడుగు వేస్తే ఇక సాదాసీదా వ్యక్తుల గతేంకాను? అంతెందుకు... పలుకుబడి వున్నవారితో విరోధమెందుకని అశోక్ నన్ను కాపాడకుంటే ఏం జరిగేది? అందుకే నేనో నిర్ణయానికి వచ్చాను. భరించేవాడు భర్త అంటారు. అలాగే నా శీలాన్ని కాపాడిన అశోక్‌నే పెళ్లాడ నిశ్చయించాను”

అంటూనే లావణ్య అశోక్ చేయి పట్టుకుని వెళ్లిపోయింది.

అరుణకుమార్ అవాక్కయిపోయాడు. కాసేపటికి కూతురి నిర్ణయమే సరైనదేమో అనే తీర్మానానికి వచ్చాడు.

★

